

**బాయిలర్లు ఉండాలి**
రైస్ ఇండస్ట్రీస్‌లో బాయిలర్లు ఉండాలని నేషనల్ ప్రొడక్టివ్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. - 8లో



**తాళం వేసిన ఇళ్లలో చోరీ**
దేవరకొండ, భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం గ్రామంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. - 8లో



**వార్డు అధికారుల బదిలీ**
భువనగిరిలో వార్డు అధికారులను బదిలీ చేస్తూ మున్సిపల్ కమిషనర్ రామలింగం ఉత్తర్వులు జారీ చేశారు. - 9లో

## న్యూస్‌రీల్

### యాదగిరి క్షేత్రంలో విశేష పూజలు



అష్టోత్తర పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామునే శ్రీస్వామి క్షేత్రాన్ని తెరిచిన ఆచార్యులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు జరిపించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం జరిపించి ఆలయ ద్వారా బంధనం చేశారు.

### ఆర్మీ కళాశాలలో సామగ్రి వేలానికి టెండర్లు

బీబీనగర్ : మండలంలోని గురుకుల ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాలకు చెందిన పాత సామగ్రి వేలం నిర్వహించడానికి కళాశాల ప్రిన్సిపాల్ నిరుప బుధవారం టెండర్లు ఆహ్వానించారు. కళాశాలను మండల పరిధిలో నుంచి మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోకి తరలించారు. దీంతో భవనంలోని మిగిలి వున్న పాత ఫర్నిచర్, ఇనుప సామగ్రి, ప్లాస్టిక్ బ్యాగ్‌లను విక్రయించేందుకు టెండర్ల ప్రక్రియ విడుదల చేశారు. విక్రయదారులు ఈనెల 6వ తేదీ లోపు తమ దరఖాస్తులతో అవుషాపూర్‌లో గల ఆర్మీ కళాశాలకు వచ్చి 9912878298 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### ట్రస్మా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

భువనగిరి: ట్రస్మా జిల్లా నూతన అధ్యక్షుడిగా పాలకూర్ల వెంకటేశం ఎన్నికయ్యారు. బుధవారం భువనగిరి పట్టణ శివారులోని దివ్య బాల విద్యాలయంలో జరిగిన ట్రస్మా ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గాదె సోమిరెడ్డి, గౌరవ సలహాదారులుగా మెరుగు మధు, ప్రధాన కార్యదర్శులుగా దాసరి శ్రీరాములు, మహిళా కార్యదర్శిగా వెల్దుర్తి బాగ్యలక్ష్మీ, కోశాధికారిగా వంగూరి పాండు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కృష్ణంరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కొండవీటి మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున్, మల్లారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఇద్దరు అభ్యర్థుల నామినేషన్

నల్లగొండ:వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన బంకరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, నల్లగొండకు చెందిన పన్నాల గోపాల్‌రెడ్డి(స్వతంత్ర) ఒకసెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠికి అందజేశారు.

### లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

భువనగిరి టౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం స్వీకరించిన ఎల్–1, ఎల్–2, ఎల్–3 దరఖాస్తులను ప్రక్రియపై బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ.గౌతమ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు భువనగిరి నుంచి ఆయన హాజరై మాట్లాడారు. అర్హులకు అన్యాయం జరగొద్దని పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులు

రామగిరి(నల్లగొండ): శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్సులు నడపనున్నట్లు రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి తెలిపారు. నల్లగొండ రీజియన్‌లోని అన్ని డిపోల్లో ఈ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు తీసుకోవచ్చని తెలిపారు. కిలోమీటర్‌కు గతంలో కంటే రూ.7 తగ్గించామని, 6 గంటల వరకు వెయిటింగ్ చార్జీ మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. నల్లగొండ 99598 44917, సూర్యాపేట 79892 25791, దేవరకొండ 73828 33031, కోదాడ 77804 33533, నార్కట్‌పల్లి 98485 84198, మిర్యాలగూడ 73828 33790, యాదగిరిగుట్ట 98851 03165 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

# రైలెళ్లిపోయింది..!

**నిరాశపర్చిన రైల్వేశాఖ**
- ఎంఎంటీఎస్‌కు మినహా దేనికీ కేటాయింపుల్లేవ్!
- జిల్లాలో ఎక్కడా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఇవ్వని హాల్టింగ్
- ప్రతిపాదనకు నోచుకోని కొత్త రైళ్లు
- మరిన్ని ప్యాసింజర్ రైళ్లు నడపాలంటున్న ప్రయాణికులు



ప్రయాణికులంటే పట్టింపు లేదా!

సాక్షి, యాదాద్రి: కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి రైల్వే శాఖ చేసిన కేటాయింపులు జిల్లా ప్రయాణికులను తీవ్ర నిరాశపర్చింది. తక్షణమే లబ్ధి చేకూరే చర్యలేవీ రైల్వే శాఖ చేపట్టలేదని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం రైళ్లలో ప్రయాణించే సామాన్య ప్రయాణికులు, ఎంపీలు కోరినట్టుగా రైళ్ల స్టాపేజీలు ఇవ్వలేదనే సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాజీపేట–సికింద్రాబాద్ మూడో లైన్, ఉమ్మడి జిల్లా మీదుగా ఏపీలోని అమరావతి వరకు ప్రతిపాదించిన బుల్లెట్ రైలు గురించి ప్రస్తావనే లేదు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంఎంటీఎస్ రైలు మార్గం పనులకు మాత్రమే నిధులు కేటాయించడం మినహా ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

**ఎంఎంటీఎస్‌కే నిధులు**

ఎంఎంటీఎస్ రెండో దశ పనులకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ నుంచి యాదాద్రి (రాయిగిరి) వరకు 38 కిలోమీటర్లు ఎంఎంటీఎస్‌ను పొడిగించారు. కేంద్రం, రాష్ట్రం నిధులతో ప్రారంభించినప్పటికీ రాష్ట్రం నిధులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పూర్తి నిధులతో తామే పూర్తి చేస్తామని కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈసారి బడ్జెట్ రూ.650 కోట్లు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే జీఎం ప్రకటించారు.

ఖాజీపేట–సికింద్రాబాద్–లింగంపల్లి మధ్య నడిచే పలు రైళ్లకు ప్రయాణికులు ఎంతో కాలంగా స్టాప్‌లను కోరుతున్నారు. ఈ మార్గంలో రోజు వారీగా వేలాది మంది ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు, రోగులు ప్రయాణిస్తున్నారు. వీరి అవసరాలకు కేవలం రెండు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఖాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం రైలు నంబర్ 67764, సాయంత్రం సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట రైలు నంబర్ 67763 మాత్రమే అన్ని స్టేషన్లలో ఆగుతాయి. ఈ మార్గంలో నాన్‌స్టాప్ సూపర్‌ఫాస్ట్ రైళ్లు నడుస్తున్నా అవి ప్రయాణికులకు అందుబాటులోకి తేలేదు.

**98 రైళ్లు నడుస్తున్నా..**

సికింద్రాబాద్–ఖాజీపేట మధ్య ప్రస్తుతం రోజూ 98 రైళ్లు నడుస్తున్నా.. రోజువారీ ప్రయాణికుల అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఖాజీపేట–సికింద్రాబాద్–హైదరాబాద్ జంట నగరాల మధ్య 17 రైల్వే స్టేషన్లు ఉన్నాయి. రోజూ ఈ మార్గంలో 84 సూపర్‌ఫాస్ట్ రైళ్లు, 14 ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఉన్నాయి. వాటిలో రెండు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే అన్ని స్టేషన్లలో ఆగుతాయి. మిగతావి ఆగకుండానే వెళ్తుండడంతో ప్రయాణికులకు లబ్ధి చేకూరడం లేదు.

**నిలిచిన ఫలక్‌నుమా సేవలు**

జనగామ–ఫలక్‌నుమా మధ్య ప్యాసింజర్ రైలు నాలుగు ట్రిప్‌లు నడిచేవి. కోవిడ్ సమయంలో ఈ రైలును నిలిపివేశారు. ఈ రైలును పునరుద్ధరించడంలేదు. ఖాజీపేట–లింగంపల్లి మధ్య సికింద్రాబాద్ మీదుగా కొత్త రైలును నడపడంలేదు. ఇంకా, భువనగిరి, ఆలేరు, జనగాం, బీబీనగర్ రైల్వే స్టేషన్లలో ఉదయం 6 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్య ప్రయాణించే కొన్ని రైళ్లకు స్టాపేజీ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ సమయంలో నడిచే సూపర్‌ఫాస్ట్ రైళ్లు చార్మినార్, పద్మావతి, విశాఖ, షిర్డీ సాయి, శాతవాహన, ఎక్స్‌ప్రెస్ లాంటి రైళ్లు ఆపాలని కోరుతున్నా కానీ బడ్జెట్‌లో పట్టించుకోలేదు.

**ప్రయాణికులకు ప్రయోజనం చేకూర్చాలి**



ప్రయాణికులకు అనుకూలంగా రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలి. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు రోజువారీ ప్రయాణికులకు మేలు జరుగుతుంది. హైదరాబాద్ మహానగరానికి గ్రామాల చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. కొత్తరైలు లేదా ప్రస్తుతం నడుస్తున్న రైళ్లను రీషెడ్యూల్ చేయాలి.

– త్రిదండపాణి పవన్‌కుమార్, లాంగ్‌ట్రెయిన్స్ అండ్ ఎంఎంటీఎస్ అసోసియేషన్ సభ్యుడు

**సమయానికి రైళ్లు నడపాలి**



సికింద్రాబాద్ – ఖాజీపేట మార్గంలో రైళ్లను సకాలంలో నడపాలి. మరో ప్యాసింజర్ రైలును అదనంగా నడపాలి. ఎంఎంటీస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. అప్పటిదాకా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజ్ ఇవ్వాలి. సాధారణ ప్యాసింజర్‌ల సమస్యలను రైల్వే శాఖ గుర్తించాలి.

– పడకంటి సందీప్, రైల్వే ప్రయాణికుడు





## కల్యాణ వైభోగమే..

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారు జామున జరిగిన శ్రీపార్వతీ జడలరామలింగేశ్వర స్వామి కల్యాణానికి హాజరైన భక్తజనం (ఇన్‌సెట్లో) కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# రేపటి నుంచి పూర్వగిరీశుడి బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు, అర్చకులు
- 13న ముగియనున్న ఉత్సవాలు



యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 7నుంచి 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకుగాను ఆలయ అధికారులు, అర్చకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇప్పటికే యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లేదారిలో తాత్కాలికంగా విద్యుత్‌కాంతులు విరజిమ్మే స్వాగత తోరణాన్ని ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగులతో సిద్ధం చేయగా, భక్తులకు తాత్కాలిక చలువ పందిర్లు చేయించారు. ఈ నెల 7న 10గంటలకు స్వస్తీ వాచనం, విశ్వక్సేనారాధన, పుణ్యహవాచనం, రక్షాబంధనం, సాయంత్రం అంకురారోపణం, మృత్సంగ్రహణంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 9వ తేది రాత్రి 7:30గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 10వ తేది రాత్రి 7:30గంటలకు శ్రీస్వామి అమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవం, 11వ తేది రాత్రి 8గంటలకు దివ్య విమాన రథోత్సవం, 12వ తేది చక్రతీర్థం ఉత్సవాలు నిర్వహించనున్నారు. 13వ తేది ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలను పరిసమాప్తం చేస్తారు.

# వంద శాతం ఫలితాలు సాధించాలి



సంస్థాన్ నారాయణపురం ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు పాఠం చెబుతున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతరావు

సంస్థాన్ నారాయణపురం: పదోవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వంద శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం సంస్థాన్ నారాయణపురంలోని ఎస్సీ హాస్టల్‌లో కలెక్టర్ రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. గణిత బోధనతో పాటు పలు అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ముందుగా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గురువారం నుంచి చదువులో వెనకబడిన విద్యార్థుల ఇంటి తలుపు తట్టి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ నర్సింహారావు, తరాబాయి, జానయ్య, జుబేర్ సుధాకర్ తదితరలు ఉన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

# 78,795 మందికి రైతు భరోసా

- నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎకరాలోపు రైతులకు రూ.46.44 కోట్లు జమ

భువనగిరి టౌన్, రామన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేసింది. మొదటి విడతలో భాగంగా బుధవారం ఎకరం లోపు భూమి కలిగిన 78,795 మంది రైతులకు రూ.46,44,93,195 నిధులను వారివారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ప్రభుత్వం గత నెలలో 26న జిల్లా వ్యాప్తంగా నాలుగు పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. అదేరోజు మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హత కలిగిన 17,644 మంది రైతుల ఖాతాల్లో రూ 26.95కోట్లు జమ చేసింది. మిగతా గ్రామాల రైతులకు సీఎం ఆదేశాల మేరకు బుధవారం విడుదల చేశారు. ఎకరం మొదలుకొని విడతల వారీగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వేసవికి ముందే నీటి సమస్య

- జంకానగూడెం, ఖాజీమహెళ్ల, సీతానగర్‌లో పనిచేయని బోర్లు
- ట్యాంకర్లతో సరఫరా చేయిస్తున్న మున్సిపల్ యంత్రాంగం
- ప్రైవేట్ ట్యాంకర్లతోనూ తెప్పించుకుంటున్న ప్రజలు



జంకానగూడెంలో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుటున్న ప్రజలు

భువనగిరి టౌన్: వేసవికి ముందే భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో అవాసాప్రాతాలైన జంకానగూడెం, ఖాజీమహెళ్ల, సీతానగర్ ప్రజలకు యంత్రాంగం ట్యాంకర్లతో మంచినీటి సరఫరా చేయిస్తోంది. స్థానికంగా ఉన్న బోర్లు మరమ్మతులకు గురై వారం రోజులుగా నల్లాల ద్వారా నీరందడం లేదు. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఐదు రోజుల నుంచి మున్సిపల్ సిబ్బంది ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మున్సిపాలిటీ అధికారులు సరిపడా ట్యాంకర్లు పంపించకపోవడంతో నీళ్లు సాలక ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్లతో తెప్పించుకుటున్నారు. భువనగిరిలో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ముదస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా తమ కాలనీల్లో పనిచేయని బోరు మోటార్లను మరమ్మతులు చేయించి నీటి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# కుల గణన సర్వే బోగస్

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత



మాట్లాడుతున్న గొంగిడి సునీత

మోటకొండూర్: కాంగ్రెస్ చేపట్టిన కులగణన సర్వే బోగస్ అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఆరోపించారు. బుధవారం మోటకొండూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం కుట్రపూరితంగా చేసిన సర్వే కారణంగా బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో 3.1 శాతం కుటుంబాలను గుర్తించలేదని చెప్పడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతకుముందు మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి అమ్మగారైన మణెమ్మ చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, భూమండ్ల ఐలయ్య, బొట్ల నర్సింహ, జీవిలికపల్లి వెంకటేష్, ఎండీ బురాన్, గౌరయ్య తదితరులు ఉన్నారు.

# మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించండి



మాట్లాడుతున్న అలుగుబెల్లి నర్సిరెడ్డి

భువనగిరి : వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న తనను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. బుధవారం భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ పరిరక్షణ కోసం అహర్నిశలు కృషిచేస్తానన్నారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర్ల యాదయ్య, మెతుకు సైదులు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన బాధ్యులు సిలువేరు మహేష్, జిల్లా కార్యదర్శుపలు జీవి రమణారావు, బాలయ్య, సుదర్శన్‌రెడ్డి, వనిత, వెంకన్న, సంజీవరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం , గోపాల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణపై నిఘా!

- తనిఖీలకు సిద్ధమవుతున్న అడ్వైజరీ కమిటీ
- అనుమతి లేని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక దృష్టి
- పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు గురించి వివరించనున్న యంత్రాంగం



అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మనోహర్

| | |
|---|---|
| అనుమతి ఉన్న స్కానింగ్ సెంటర్లు : | 57 |
| ప్రస్తుతం పనిచేస్తున్నవి : | 41 |

భువనగిరి: జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇందుకోసం బుధవారం భువనగిరిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ అనుమతితో కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లను తనిఖీలో భాగంగా నిర్వాహకులకు పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు–1994 గురించి వివరించాలని నిర్ణయించారు. గర్భంలో ఉన్న శిశువు మగ బిడ్డా.. ఆడ బిడ్డా అని తెలుసుకునేందుకు కొంత మంది లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి, రెండో కాన్పుల్లో ఆడబిడ్డలు పుట్టిన తర్వాత మగ బిడ్డ కోసం ముందస్తుగా లింగ నిర్ధారణ చేసుకుంటున్నట్లు సమాచారం. బేటి బచావో–బేటి పడావో కింద లింగ నిర్ధారణ నేరం అనే విషయాన్ని తెలియజేసేందుకు జిల్లా అడ్వైజరీ కమిటీ సిద్ధమవుతోంది.

**విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు**

గతంలో జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, చౌటుప్పల్ ప్రాంతాల్లో పలు స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరుపుతున్నట్లు ఫిర్యాదు రావడంతో వైద్యారోగ్య శాఖ అధికారులు సైతం ఆయా స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఆయా ప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లను సీజ్ చేసిన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం కూడా జిల్లాలో కొన్ని చోట్ల లింగ నిర్ధారణ పరీక్షలు విచ్చలవిడిగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనుమతి ఉన్న స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు జిల్లాలోని కొన్ని మండల కేంద్రాల్లో ఉన్న క్లీనిక్‌కు మొబైల్ స్కానింగ్ మిషన్ తీసుకెళ్లి అక్కడ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో ఒక్కో బాధితుల నుంచి రూ.5వేల నుంచి రూ.8వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

**అనుమతి లేని సెంటర్లను గుర్తించేలా..**

జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 57 ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 41 స్కానింగ్ సెంటర్లు మాత్రమే పనిచేస్తున్నాయి. కాగా అనుమతి లేకుండా చాలా చోట్ల స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయి. ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని గుర్తించి వారికిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు జిల్లా అడ్వైజరీ కమిటీ సిద్ధమవుతోంది. పనిచేయని స్కానింగ్ సెంటర్లు సైతం వాస్తవంగా అవి పనిచేస్తున్నయా లేదా అనేది తెలుసుకునేందుకు తనిఖీలు చేయనున్నారు. ప్రధానంగా జిల్లాలో భువనగిరితో పాటు బొమ్మలరామారం, తుర్కపల్లి, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, బీబీనగర్‌లో ఉన్న స్కానింగ్ సెంటర్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని భావిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అనుమతి ఉన్న స్కానింగ్ సెంటర్లలో వైద్యుల సలహా మేరకు మాత్రమే స్కానింగ్ సెంటర్‌కు సాధారణ పరీక్షల కోసం వెళ్లారా లేదా మరో కారణంగా వెళ్లారు అనే విషయాలపై ఆరా తీయనున్నారు.

**లింగ నిష్పత్తిని తగ్గించాలి**

భువనగిరి: జిల్లాలో లింగ నిష్పత్తిని తగ్గించావల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. బుధవారం భువనగిరిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 57 ఉన్నాయని. ఇందులో 41 మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులతో పాటు జిల్లాలోని కళాశాలలు, హాస్టల్స్‌లోని విద్యార్థులకు ప్రి కాన్సెప్షన్, ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం (పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్టు)–1994 గురించి అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయడతో పాటు ఆడిట్ చేయాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీసీ అండ్ పీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎల్.యశోద, డాక్టర్ మాలతీ, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కవిత, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.స్వరాజ్యలక్ష్మి, సౌజన్య, ప్రమీల, శివలింగం, కవిత అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎంజీయూలో అధికారుల పదవీకాలం పొడిగింపు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో పనిచేస్తున్న అధికారుల పదవీకాలాన్ని పొడిగించారు. పరీక్షల నియంత్రణ అధికారి జి. ఉపేందర్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ మిరియాల రమేష్, ఆడిట్ సెల్ అడిషనల్ డైరెక్టర్ వైజయంతి పదవీకాలాన్ని మరో ఏడాది పాటు పొడిగిస్తూ బుధవారం రిజిస్ట్రార్ అలువాల రవి ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కోఆర్డినేటర్‌గా జయంతిని నియమించారు.

### యువకుడు అదృశ్యం


శశికాంత్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని గౌస్‌కొండ గ్రామానికి చెందిన కాసుల శశికాంత్(23) కనిపించడం లేదని అతడి తండ్రి కాసుల వీరేశ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ పూర్తి చేసిన శశికాంత్ సెల్‌ఫోన్ రిపేరింగ్ నేర్చుకున్నాడు. ఏదైనా పనిచేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో గత నెల 28వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శశికాంత్ మొబైల్‌కు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వచ్చింది. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి వీరేశ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.


### విద్యుదాఘాతంతో యువకుడు మృతి


గోపి (ఫైల్)

కనగల్: వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం కనగల్ మండలం జీ. యడవల్లి గ్రామంలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ ఎంఏ రషీద్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. జీ. యడవల్లి గ్రామానికి చెందిన మన్నెం గోపి(32) బుధవారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. గోపి ఎంబీఏ చదివాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో గల్లంతు


హాలియా: సాగర్ ఎడమ కాల్వలో యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల కేంద్రానికి చెందిన పెండ్యాల అనిల్(19) ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన ఫ్లెక్సీలను కట్టేందుకు మంగళవారం రాత్రి హాలియాకు వచ్చాడు. రాత్రి హాలియాలోనే నిద్రించిన అనిల్ బుధవారం ఉదయం ముఖం కడుకునేందుకు హాలియా సమీపంలోని సాగర్ ఎడమ కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అనిల్ అన్న పెండ్యాల పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.


తలంబ్రాలు తీసుకుస్తున్న శివసత్తి


చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామి కళ్యాణానికి హాజరైన భక్త జనం

# కల్యాణం.. కమనీయం

- అంగరంగ వైభవంగా చెర్వుగట్టు రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం
- పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే దంపతులు
- ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న శివసత్తుల నృత్యాలు


కోనేరులో భక్తుడి పుణ్యస్నానం


కల్యాణతంతులో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుపై కొలువైన పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వం తరఫున బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బొల్లంపల్లి కృష్ణ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు కూడా పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను ప్రధాన మండపం నుంచి వృషభ వాహనంపై ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం శైవాగమ పండితులు అల్లపురం సుబ్రహ్మణ్యదీక్షితావధాని, ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, శ్రీధర్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ, సురేశ్‌శర్మ, సతీష్‌శర్మ తదితర అర్చక బృందం మాఘ శుద్ధ సప్తమి గడియల్లో స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులు ఒడిబియ్యం సమర్పించారు.

**ప్రత్యేక ఆకర్షణగా శివసత్తులు**

కల్యాణోత్సవంలో శివసత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శివసత్తులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరించిన బుట్టలల్లో ఒడిబియ్యం, వస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో సుమారు 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కల్యాణం కొనసాగిందిలా..**

బుధవారం తెల్లవారుజామున 4.15 గంటలకు ప్రధాన ఆలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బొల్లంపల్లి కృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. 4.45 గంటలకు తలంబ్రాలు, పట్టువస్త్రాలను కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. 5.20 గంటలకు పట్టువస్త్రాలు సమర్పించారు. 6.15 గంటలకు జీలకర, బెల్లం, 6.40 గంటలకు మాంగళ్యధారణ గావించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నేతగాని కృష్ణ, బండా సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పున్నపురాజ యాదగిరి, కొప్పు శ్రీను, వరాల రమేష్, గడుసు శ్రీధర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, రేగట్టె నవీన్‌రెడ్డి, రేగట్టె నర్సిరెడ్డి, మల్గ శంకర్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, జెర్రిపోతుల భరత్, సామ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీశైలం తర్వాత అంత పవిత్రమైంది**

శ్రీశైలం దేవాలయం తర్వాత అంత పవిత్రమైన దేవాలయం చెర్వుగట్టు అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ ప్రజలకు అంతా మంచి జరగాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రామలింగేశ్వరుడికి మొక్కినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**భక్తుల ఇబ్బందులు**

కల్యాణోత్సవాన్ని హాజరైన భక్తులకు కోసం రెండు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొంతమంది భక్తులు క్యూలైన్‌లో కాకుండా అనుమతి లేని మార్గం నుంచి కల్యాణ మండపం వద్దకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.

**హుండీ ఆదాయం రూ.8,89,445**

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కల్యాణానికి విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సాయంత్రం లెక్కించారు. రూ.8,89,445 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. గతేడాది రూ.9,90,520 ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ బి. కృష్ణ, జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. భాస్కర్, దేవస్థాన సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, నరేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు

**ఎస్పీ పర్యవేక్షణ..**


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చెర్వుగట్టు ఆలయాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సందర్శించారు. ఉదయం జరిగిన స్వామివారి కల్యాణానికి వచ్చిన భక్తుల సంఖ్య గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గట్టు పైన, కింద వివిధ ప్రదేశాలను, కల్యాణ మండపం ప్రాంతాలను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ శివరాంరెడ్డి, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, సీఐలు నాగరాజు, రాఘవరావు, రాజు, ఎస్ఐలు క్రాంతికుమార్, రవి, సైదాబాబు, విజయ్ తదితరులు ఉన్నారు.


కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


గుండు వద్ద మొక్కుతున్న భక్తులు

## పర్యావరణాన్ని కాపాడేలా బాయిలర్లు ఉండాలి

- నేషనల్ ప్రొడక్టివ్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ వినోద్‌కుమార్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మిర్యాలగూడ: కాలుష్యాన్ని నియంత్రిస్తూ పర్యావరణ సుస్థిరతను కాపాడే విధంగా రైస్ ఇండస్ట్రీస్ బాయిలర్లను నిర్వహించాలని నేషనల్ ప్రొడక్టివ్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో రైస్ మిల్లర్లు, బాయిలర్ల నిర్వాహకులతో వర్క్‌షాప్ ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంధనం కాల్చడంతో వచ్చే వేడిని ఆప్టిమైజ్ చేయాలని, వ్యర్థ ఉష్ణాన్ని పునరుద్ధరించి బాయిలర్ల ఉష్ణశక్తి పెంచుకునేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించారు. బాయిలర్ పనితీరును దెబ్బతీసే తుప్పును నివారించడం, నీటి శుద్ధిపై యాజమాన్యాలు దృష్టి సారించాలన్నారు. బాయిలర్ ఆపరేటర్ల భద్రతకు జాతీయ ఉత్పాదక మండలి నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నార. అనంతరం బాయిలర్ నిర్వాహకులకు పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ బాయిలర్ ఇన్‌స్పెక్టర్ భీమారావు, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంట సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటరమణచౌదరి, నేషనల్ ప్రొడక్టివిటి కౌన్సిల్ సభ్యులు, రైస్ మిల్లర్లు, బాయిలర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## తల్లీకుమారుడికి జీవిత ఖైదు

- వివాహిత హత్య కేసులో కోర్టు తీర్పు

ఖమ్మం లీగల్: వివాహితను హత్య చేసినట్లు తేలడంతో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం తండాకు చెందిన ఆమె భర్త తేజావత్ ఉపేందర్నాయక్, అత్త తేజావత్ పద్మకు జీవిత ఖైదు విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు... సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం పాలారం తండాకు చెందిన భూక్యా కాలియా తన కుమార్తె కల్యాణిని ఉపేందర్‌కు ఇచ్చి 2017లో రూ.4.50లక్షల కట్నం ఇచ్చి వివాహం జరిపించాడు. ఏడాది పాటు కాపురం సజావుగానే సాగగా వీరికి కుమార్తె జన్మించింది. ఆతర్వాత ఉపేందర్ మంగాపురం తండాకు చెందిన ఇస్లావత్ అరుణతో వివాహేతర సంబంధం పెట్టుకుని అదనపు కట్నం తీసుకురావాలని కల్యాణిని కోసం వేధించసాగాడు. ఆయనకు తల్లి పద్మ, తండ్రి కృష్ణ, సోదరి కవితతో పాటు అరుణ జత కలిసి కల్యాణిని వేధిస్తూ కూల్డ్రింక్ లో విషం కలిపి చంపటానికి ప్రయత్నించగా తప్పించుకుని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. దీంతో పెద్దల సమక్షాన మాట్లాడి ఆగస్టు 2019లో పొలం అమ్మి విడతల వారీగా రూ.12లక్షల వరకు చెల్లించారు. అయితే, 2020 ఫిబ్రవరి 12న కాలియాకు ఫోన్ చేసిన ఉపేందర్ కల్యాణి కళ్లు తిరిగి క్రింద పడిందని చెప్పగా వెళ్లేసరికి గొంతు, రెండు కాళ్లపై గాయాలు ఉండడంతో హత్య చేసినట్లు గుర్తించాడు. ఈమేరకు ఉపేందర్, ఆయన తల్లిదండ్రులు పద్మ, కృష్ణ, మంగాపురం తండాకు చెందిన అరుణ, ముదిగొండకు చెందిన దారా కవిత తన కుమార్తెను హత్య చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 21 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించగా కల్యాణి భర్త ఉపేందర్, ఆయన తల్లి పద్మపై నేరం రుజువైనందున యావజ్జీవ శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ముగ్గురిపై కేసు కొట్టేశారు.

## ఆర్‌జీఏ మనీ యాప్ నిందితుల అరెస్ట్

- రూ.3.50లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం

మునగాల: ఆర్‌జీఏ మనీ యాప్ పేరుతో తక్కువ రోజుల్లో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించవచ్చునని ప్రచారం చేసి పలువురిని మోసం చేసిన ఐదుగురు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రామకృష్ణారెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఎనుగుల శంకర్‌రావు, గండు ఎల్లయ్య, రెడ్డిపల్లి బుచ్చిబాబు, కృష్ణానగర్ గ్రామానికి చెందిన బేతం ప్రభాకర్‌రెడ్డి, మిర్యాలగూడ పట్టణానికి చెందిన కేతావత్ మూన్‌సింగ్ ఆర్‌జీఏ మనీ యాప్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, ఖమ్మం జిల్లా కూసుమంచిలో కార్యాలయాలు ప్రారంభించి ఉధృతంగా ప్రచారం చేశారు. ఈ ఆర్‌జీఏ యాప్‌లో పలువురు డబ్బులు పెట్టుబడి పెట్టి నష్టపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.3.50లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మునగాల పరిధిలో ఈ యాప్‌లో వందలాది మంది డబ్బులు పెట్టుబడిగా పెట్టి నష్టపోయినట్లు తమ విచారణలో తేలిందని అన్నారు. ఇది సైబర్ నేరం కిందకు వస్తుందని, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు.

## కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తల మధ్య ఘర్షణ

- ఏడుగురికి గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



గాయపడిన విజయ్‌కుమార్‌గౌడ్, ప్రదీప్

మునగాల: మునగాల మండలంలోని కలకోవ గ్రామంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్, సీపీఎం కార్యకర్తలు ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకోవడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. కలకోవ గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పనస విజయ్‌కుమార్‌గౌడ్ మంగళవారం రాత్రి తన స్నేహితులతో కలిసి గ్రామానికి వస్తుండగా.. ఓ వీధిలో సీపీఎంకు చెందిన కాసాని బలరామ్, కాసాని ముత్తయ్య, కాసాని వెంకన్నతో పాటు మరికొందరు తమపై దాడి చేశారని ఆరోపించారు. వీరికి సీపీఎం మండల నాయకుల మద్దతు ఉందని విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ దాడిలో తనతో పాటు దళితుడు చిర్ర ప్రదీప్ తలకు గాయాలయ్యాయని, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకొని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారని విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో సీపీఎంకు చెందిన గూండాలు అలజడి సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

**ఇరువర్గాలపై కేసు నమోదు..**

ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పనస విజయకుమార్, చిర్రా ప్రదీప్, మునగలేటి శేఖర్, దొడ్డారపు వెంకటేష్ తమపై దాడి చేశాడని కాసాని బలరామ్ ఫిర్యాదు చేశాడని, అదేవిధంగా కాసాని బలరామ్, కాసాని వెంకన్న, కాసాని ముత్తయ్య తమపై దాడి చేశారని చిర్రా సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. గ్రామంలో ప్రస్తుతం పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.



## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వేములపల్లి(మాడ్గులపల్లి): అనారోగ్యంతో బాధపడుతూ గడ్డి మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ వెంకట్‌రాంరెడ్డి(85) భార్య రాములమ్మ రెండేళ్ల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి అతడు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇటీవల కాలంలో మోకాళ్ల నొప్పితో బాధపడుతున్న వెంకట్‌రాంరెడ్డి ఈ నెల 4వ తేదీ ఇంట్లో గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న వెంకట్‌రాంరెడ్డి అన్న కొడుకు జొన్నలగడ్డ రంగారెడ్డి అతడిని నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి చిన్న కుమార్తె జూలకంటి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## టాటా ఏస్ వాహనం దగ్ధం

నార్కట్‌పల్లి: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి శివారులో బుధవారం టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఆటో నగర్‌కు చెందిన రవి కొంతకాలంగా సెకండ్ హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసి విక్రయిస్తున్నాడు. ఇందులో భాగంగా నలగొండలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నిర్వహించిన వేలంలో టాటా ఏస్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. ఆ వాహనాన్ని తనతో తీసుకొచ్చిన మరొక వాహనంకు లింక్ చేసి నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా.. నార్కట్‌పల్లి శివారులో కొనుగోలు చేసిన టాటా ఏస్ వాహనం టైరులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దగ్ధమైంది. లింక్ వాహనాన్ని వేరు చేయడంతో దానికి ఎలాంటి నష్టం జరగలేదు.


దగ్ధమైన టాటా ఏస్ వాహనం

## ద్విచక్ర వాహనం పైనుంచి పడి దుర్మరణం

ఆలేరురూరల్: ద్విచక్ర వాహనంపై వెళ్తూ కిందపడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆలేరు పట్టణంలో జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామానికి చెందిన నడిగొట్టు లింగం(40) ద్విచక్ర వాహనంపై మంగళవారం సాయంత్ర హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో ఆలేరు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయం సమీపంలోకి రాగానే ఎదురుగా కుక్క అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో అదుపుతప్పి ద్విచక్ర వాహనం పైనుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో లింగం తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రజనీకర్ తెలిపారు.

**కరెంట్ స్తంభానికి ఢీకొట్టి..**

తిప్పర్తి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి కరెంట్ స్తంభానికి ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని హ్యాపీ హోమ్స్ కాలనీ సమీపంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన మేకల మహేశ్ (25) ద్విచక్రజు వాహనంపై హ్యాపీ హోమ్స్ కాలనీ సమీపంలో గల తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా.. అదుపుతప్పి కరెంట్ స్తంభానికి ఢీకొట్టాడు. మహేశ్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి చిన్నమ్మ వనపర్తి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు.

## తాళం వేసిన ఇళ్లలో చోరీ

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ఓ ఇంట్లో పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి మూడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం జరిగింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న రాఘవాచారి కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాఘవాచారి భార్య హైదరాబాద్‌కు వెళ్లగా రోజుమాదిరిగా రాఘవాచారి తన షాపు వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన సమయానికి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

**జలాల్‌పురంలో రెండిళ్లలో..**

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలం జలాల్‌పురంలో బుధవారం రెండిళ్లలో చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జలాల్‌పురం గ్రామానికి చెందిన బండ బాల్‌రెడ్డి కుటుంబం రెండు రోజుల క్రితం ఇంటికి తాళంవేసి చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెంలో తమ బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. తిరిగి బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా బీరువాలోని దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. సమాచారం తెలుసుకున్న చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. గొడ్డలితో బీరువాను పగులగొట్టి రూ.70 వేల నగదు, తులం బంగారు గొలుసును చోరీ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కొయ్యడ భరత్ మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన భార్య ప్రసవం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లి అక్కడే ఉన్నాడు. బుధవారం ఉదయం భరత్ ఇంటికి తాళం లేకపోవడం గమనించిన అతడి బంధువులు వెంటనే సమాచారం ఇచ్చారు. అతడు ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని తులం బంగారు గొలుసు చోరీ చేసినట్లు గుర్తించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మద్యానికి బానిసై వ్యక్తి మృతి

చింతపల్లి: అతిగా మద్యం తాగిన వ్యక్తి వాంతులు చేసుకుని మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కిందగూడ గ్రామానికి చెందిన మహేష్ చౌడి(36) చింతపల్లి మండల కేంద్రంలో గోదాసు చక్రపాణికి చెందిన పామాయిల్ తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. మహేష్ చౌడి మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల నుంచి ఎక్కువగా మద్యం తాగుతున్న మహేష్ చౌడి బుధవారం వాంతులు చేసుకొని మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమార్తె ఉంది.

## రైలు ఢీకొని..

వలిగొండ: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలం టేకులసోమారంలో బుధవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులసోమారం గ్రామానికి చెందిన గీత కార్మికుడునారగోని సైదులు(38) గ్రామ సమీపంలో రైల్వే పట్టాలపై గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. బుధవారం సాయంత్రం అటుగా వెళ్తున్న రైల్వే సిబ్బంది పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసు అధికారి కృష్ణారావు తెలిపారు.

## షాపులోకి దూసుకొచ్చి పల్టీకొట్టిన కారు


పల్టీకొట్టిన కారు

బీబీనగర్: భువనగిరి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బీబీనగర్ మండల కేంద్రంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న ఓ హార్డ్‌వేర్ షాపు వైపు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి కారు వస్తుండగా.. ఒక్కసారిగా బైక్ అడ్డం రావడంతో కారు డ్రైవర్ బైక్‌ను తప్పించేందుకు బ్రేక్‌కు బదులు ఎక్స్‌లేటర్‌ను నొక్కాడు. దీంతో కారు వేగంగా వెళ్లి సర్వీస్ రోడ్డు పక్కన గల హార్డ్‌వేర్ షాపు వైపు దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. క్రేన్ సహాయంతో కారును పక్కకు తొలగించారు.

## బెల్ట్ షాపులపై పోలీసుల దాడి

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి, దోతిగూడెం గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.20వేల విలువైన 23 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న కొమ్మన ధనుంజయ్యతో పాటు మరో మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.